నమస్తే తెలంగాణ



## ఘనంగా ఇరిసెట్ దినోత్సవం

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ కమ్యూనికేషన్స్ (ఇరిసెట్) 67వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రైల్వేకు చెందిన పలువురు సీనియర్ అధికారులతో పాటు ఇరిసెట్ డైరెక్టర్ పాల్గొన్నారు. రైల్వేలో కొత్తగా నియామకమైన అధికారులు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చే సంస్థగా దీనికి మంచి గుర్తింపు పొందింది. ఈ సంస్థ ఈ ఏడాదిలో 5,195 మందికి శిక్షణ ఇచ్చి రికార్డు సృష్టించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

## రేపు ఇందిరాపార్క్ వద్ద బీఎడ్ అభ్యర్థుల ధర్నా

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాబోయే డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులతో సమానంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్‌తో బీఎడ్ అభ్యర్థులు ఆందోళన బాటపడుతున్నారు. ఈ మేరకు ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా చేయనున్నామని రాష్ట్ర బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు ప్రకటించారు. బీఎడ్ చేసిన వారు సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్జీటీ అవకాశం కోల్పోయినట్టు తెలిపారు. మరోవైపు ప్రభుత్వం ఖాళీ అయిన పోస్టులను 70 శాతం మేర పదోన్నతుల ద్వారా భర్తీ చేయడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. వందశాతం పోస్టులను కేవలం నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చేపట్టనున్న ధర్నాకు బీఎడ్ అభ్యర్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## 'ఎన్ఎంఎంఎస్'కు 32,942 మంది హాజరు

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా 174 సెంటర్లలో ఆదివారం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం పరీక్ష నిర్వహించారు. 34,538 మంది విద్యార్థులకు గానూ 32,942 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష ద్వారా మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి కేంద్రం ద్వారా ఏటా స్కాలర్‌షిప్‌లు అందించనున్నారు.

# ఆర్టీసీలో 30% అద్దె బస్సులే

- తెలంగాణ ఏర్పాటు నాటికి 17 శాతం మాత్రమే
- ఎలక్ట్రిక్ బస్సులన్నీ అద్దెవే
- మూడేండ్లలో 8వేల బస్సులు వచ్చే అవకాశం
- పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద 2,800.. మహిళలకు 1000 ఎలక్ట్రిక్ బస్సులు
- అద్దె బస్సులకు డ్రైవర్ల నియామకం నిర్వాహకులదే




హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య పెరిగింది. ఇప్పటికే 2,800 ప్రైవేటు బస్సులు ఉండగా, మరో 3 వేల బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఆర్టీసీలో మొత్తం 9,800 బస్సులు ఉన్నాయి. వీటిల్లో ప్రైవేటు వ్యక్తులు ఆర్టీసీకి అద్దెకిచ్చిన బస్సులు 2,800 ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014లో ఆర్టీసీలో అద్దె బస్సుల వాటా 17 శాతం మాత్రమే. ఆర్టీసీకి ఇవ్వాల్సిన గ్రాంట్లు ఇవ్వకపోవడం, బకాయిలు పెరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అద్దె బస్సులను పెంచుతూ వస్తున్నారు. ఇలా పెంచుకుంటూపోతే .. రానున్నరోజుల్లో ఆర్టీసీలో సొంత బస్సులు ఉండే అవకాశమేలేదని ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అద్దె బస్సుల సంఖ్యను పెంచడాన్ని ఆర్టీసీ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అద్దె బస్సులకు డ్రైవర్లను వాటి నిర్వాహకులే నియమిస్తుండటంతో.. డ్రైవర్ల జీతాల ఖర్చు తగ్గుతుందని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తున్నది.

### ఎలక్ట్రిక్ బస్సులన్నీ అద్దె బస్సులే..

ఆర్టీసీలో కొత్తగా తీసుకుంటున్న ఎలక్ట్రిక్ బస్సులన్నీ అద్దె ప్రాతిపదికనే తీసుకుంటున్నారు. 'ఫేమ్' పథకం కింద హైదరాబాద్ విమానాశ్రయానికి తిప్పుతున్న 40 ఎలక్ట్రిక్ బస్సులు, ఇటీవల మరో 100 ఎలక్ట్రిక్ బస్సులు ఒలెక్ట్రా సమకూర్చింది. వీటితో పాటు ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ మరో 90 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చింది. కొత్తగా వచ్చిన మరో 40 బస్సులను ప్రారంభించాల్సి ఉంది. ఇలా ప్రస్తుతం మొత్తం బస్సుల్లో అద్దె బస్సుల వాటా దాదాపు 30 శాతానికి చేరింది.

### మూడేండ్లలో 8వేల బస్సులు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'పీఎం-ఈ డ్రైవ్' పథకం కింద 2,800 బస్సులు మంజూరు చేయాలని ఆర్టీసీ దరఖాస్తు చేసింది. దేశవ్యాప్తంగా ఆ పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులు తిప్పేందుకు కేంద్రం 9 నగరాలను ఎంపిక చేసింది. అందులో హైదరాబాద్ కూడా ఒకటి. ఆర్టీసీ దరఖాస్తు మేరకు ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు కానున్నాయి. తాజాగా మహిళా సంఘాలు 1,000 బస్సులను ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే మూడేళ్లలో అద్దె బస్సుల సంఖ్య 8వేలకు చేరే అవకాశం ఉంది. అద్దె బస్సులు భారీగా వస్తున్నందున సొంత బస్సులు కొనేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని ఆర్టీసీ కార్మికులు పేర్కొంటున్నారు.

# 'అవినీతి' చేప!

- జిల్లాల్లో అధికారుల ఇష్టారాజ్యం
- నాణ్యతలేని చేపపిల్లల పంపిణీ
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- లక్ష్యం 40 కోట్లు, వేసింది 23 కోట్లే

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంలో భారీ అవినీతి జరుగుతున్నట్టు తెలుస్తున్నది. సరఫరాదారులతో కొందరు మత్స్యశాఖ అధికారులు కుమ్మక్కై అడ్డంగా దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరఫరాదారులిచ్చే తాయిలాలకు ఆశపడి ఈ పథకానికి తూట్లు పొడుస్తూ మత్స్యకారుల ఉపాధికి గండి కొడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జిల్లా మత్స్యశాఖ అధికారులు (డీఎఫ్‌వోలు) చేపపిల్లల పంపిణీలో అవినీతే పరమావధిగా పని చేస్తున్నారని, నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారని తెలిసింది. ముఖ్యంగా నాసిరకమైన, చనిపోయిన చేపపిల్లల్ని పంపిణీ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ బాగోతంపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఇప్పటికే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. దీన్ని బట్టే పరిస్థితి ఏ విధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

### మంత్రికే షాక్ ఇచ్చిన అధికారులు

ఇటీవల తన నియోజకవర్గంలోని చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేసేందుకు వెళ్లిన మంత్రి జూపల్లి.. అక్కడి పరిస్థితిని చూసి షాక్‌కు గురయ్యారు. చేపపిల్లలు చిన్నసైజులో నాసిరకంగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ చేపపిల్లల్ని వెనక్కి పంపేయాలని ఆదేశించారు. చివరికి వాటిని పంపిణీ చేయకుండానే వెళ్లిపోయారు. జగిత్యాల జిల్లాలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. నిబంధనల ప్రకారం రిజర్వాయర్లలో వేసే చేపపిల్లలు 80-100 మిల్లీమీటర్ల పరిమాణంలో, చెరువుల్లో వేసే చేపపిల్లలు 35-40 మి.మీ. ఉండాలి. అధికారులు అంతకన్నా తక్కువ సైజు పిల్లల్ని తీసుకొస్తున్నట్టు తెలిసింది.

### తూకం లేకుండానే పంపిణీ

సరఫరాదారులతో అధికారులు కుమ్మక్కై తూకం వేయకుండానే చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారు. తక్కువ చేపపిల్లలను పంపిణీ చేసి, రికార్డుల్లో మాత్రం ఎక్కువ చేపపిల్లలను పంపిణీ చేసినట్టు నమోదు చేస్తున్నారు. దీంతో సరఫరాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి ఘటనలు జగిత్యాల జిల్లాలో అధికంగా జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. కిలోకు 250-300 చేపపిల్లలు ఉండాలి. వాస్తవానికి సగమే పంపిణీ చేస్తున్నట్టు సమాచారం.



### ఈ సీజన్‌లో 25 కోట్ల చేపపిల్లలతో సరి

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏటా దాదాపు 80 కోట్ల చేపపిల్లల్ని పంపిణీ చేసింది. కానీ, ప్రస్తుత సీజన్‌లో 40 కోట్ల చేపపిల్లల్ని మాత్రమే పంపిణీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో ఇప్పటివరకు కేవలం 23 కోట్ల చేపపిల్లలను మాత్రమే పంపిణీ చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు.. మరో ఒకటి లేదా రెండు కోట్ల చేపపిల్లలను పంపిణీ చేసి, ఈ నెలాఖరుకు ఈ ప్రక్రియను ముగించేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

## కోల్‌కతాలో దవాఖానపై 100మంది దాడి

- ముగ్గురు నర్సులకు గాయాలు..
- అద్దాలు, తలుపులు ధ్వంసం

కోల్‌కతా, నవంబర్ 24: వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆరోపిస్తూ రోగి బంధువులు, సన్నిహితులు కోల్‌కతాలో ప్రభుత్వ దవాఖానపై దాడికి తెగబడ్డారు. చనిపోయిన రోగికి సంబంధించిన 100 మందితో కూడిన గుంపు దవాఖానలో రణరంగం సృష్టించింది. బెహలాలోని విద్యాసాగర్ ప్రభుత్వ దవాఖానలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చినా, పరిస్థితి అదుపులోకి రావడానికి నాలుగు గంటలు పట్టింది. 32 ఏండ్ల పేషెంట్ దవాఖానలో చనిపోవటం ఈ ఘటనకు దారితీసింది. వైద్యుల నిర్లక్ష్యమే రోగి చనిపోవటానికి కారణమంటూ కొంతమంది దవాఖాన అద్దాలు, తలుపులు పగలగొట్టారు. ఔషధాల్ని, ఇంజెక్షన్లను బయటకు విసిరేస్తూ.. అక్కడి సిబ్బందిపై దాడికి దిగారు. కుర్చీలు, టేబుళ్లు, ఇతర ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ముగ్గురు నర్సులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు 9 మందిని అరెస్టు చేశారు. మరో 13మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ల్యాబ్‌లో మినీ బ్రెయిన్స్ తయారీ

**వీటితో అనేక వ్యాధులకు చెక్**

న్యూఢిల్లీ, నవంబర్ 24: ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో మరణాలకు కారణమవుతున్న అల్జీమర్స్, పార్కిన్సన్, వెన్నెముక గాయాలకు సైంటిస్టులు సరికొత్త చికిత్సను కనుగొన్నారు. అంతరిక్షంలోని ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన 'మినీ బ్రెయిన్స్' నాడీ సంబంధమైన అనేక వ్యాధులకు పరిష్కారం చూపుతాయని చెబుతున్నారు. ఇందుకు సంబంధించి అమెరికా బయోటెక్నాలజీ కంపెనీ 'ఆక్సానిస్ థెరపాటిక్స్' ఒక సరికొత్త వైద్య చికిత్సను అభివృద్ధి చేసింది. తాము కనుగొన్న కొత్త పద్ధతిని ఎలుకలపై ప్రయోగించగా మంచి ఫలితాలు వచ్చినట్టు కంపెనీ తెలిపింది. ల్యాబ్‌లో తయారుచేసిన మెదడును పోలిన సూక్ష్మ అవయవాలను (మినీ బ్రెయిన్స్) 'బ్రెయిన్ ఆర్గనాయిడ్స్' కూడా పేర్కొంటారు. వీటి తయారీ భూమిపై కొన్ని నెలల సమయం పడితుంది. అంతరిక్షంలోని 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం'లో కేవలం 72 గంటల్లో వీటిని తయారుచేసినట్టు సైంటిస్టులు చెబుతున్నారు. ఆర్గనాయిడ్స్‌ను ల్యాబ్‌లో సైంటిస్టులు మూల కణాల నుంచి కృత్రిమ పద్ధతుల్లో తయారుచేస్తారు. ఇవి మనిషి మెదడు నిర్మాణాన్ని, పనితీరును పోలి ఉంటాయి.

## ఫిలిప్పీన్ రాజధానిలో భారీ అగ్నిప్రమాదం

**ఆహుతైన వెయ్యికి పైగా ఇళ్లు**

మనీలా, నవంబర్ 24: ఫిలిప్పీన్ రాజధాని మనీలాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక మురికివాడలో ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో వెయ్యికి పైగా ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. భారీగా ఆస్తి నష్టం జరిగింది. భారీగా ఎగసిపడ్డ మంటలు, దట్టమైన పొగలతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. అయితే ఒక ఇంటిలోని రెండో అంతస్తులో ఏర్పడిన మంటలు ఆ ప్రాంతమంతా వ్యాపించాయని స్థానికులు కొందరు తెలిపారు. అగ్నిమాపక, ఇతర రక్షక బృందాలు మంటలను ఆర్పుతున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరూ మరణించలేదని, మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాక నష్టాన్ని అంచనా వేస్తామని అధికారులు తెలిపారు.





## ఇస్లామాబాద్‌లో లాక్‌డౌన్

**పీటీఐ నిరసన నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం**

ఇస్లామాబాద్, నవంబర్ 24: పాకిస్థాన్ ప్రభుత్వం దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో ఆదివారం భారీగా భద్రతా దళాలను మోహరించింది. రోడ్లను మూసివేసి, మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపేసింది. జైల్లో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలంటూ ఆయన మద్దతుదారులు ఆదివారం ఇస్లామాబాద్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. బానిసత్వ సంకెళ్లను తెంచేందుకు చేస్తున్న ఈ నిరసన కవాతులో ప్రజలు పాల్గొనాలని ఇమ్రాన్ ఖాన్ పార్టీ పీటీఐ పిలుపునిచ్చింది. ఇమ్రాన్ ఖాన్ భార్య బుష్రా బీబీ, ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి అలీ అమీన్ ఈ కవాతుకు నేతృత్వం వహించనున్నారు. పాక్‌లోనూ బంగ్లాదేశ్‌లా సామూహిక నిరసన ప్రదర్శన జరిగే అవకాశం ఉన్నదని అమీన్ హెచ్చరించారు. ఇమ్రాన్ ఖాన్‌తో పాటు తమ పార్టీ ఇతర నాయకులను జైళ్ల నుంచి విడుదల చేయాలని, ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ నుంచి దొంగిలించిన మెజారిటీని పునరుద్ధరించాలని, ఉన్నత స్థాయి జడ్జీల నియామకంలో చట్టసభల సభ్యులకు గల అధికారులను పునరుద్ధరించాలని పీటీఐ డిమాండ్ చేస్తున్నది.

# ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు




**పర్సనల్** ఫైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్ఠికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అంతకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

### స్కోర్ పెంపునకు మార్గాలు

**సకాలంలో చెల్లింపులు**

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండి బకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

**పరిమితంగా రుణాలు**


రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణభారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

**అప్పుల అన్వేషణ వద్దు**

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

**పొరపాట్లను సరిచేయాలి**

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.




**గ్యారంటీలకు దూరంగా..**

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

**సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు**

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.

## రాబడి

# పిల్లల విద్య కోసం..

పిల్లల విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

**ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు**

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.



**హైబ్రిడ్ ఫండ్స్**

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

**విద్యా పథకాలు**

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

**ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

**విద్యా రుణాలు**

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

**బీమా ప్లాన్లు**

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధనసాయం లభిస్తుంది.

# ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

**ఒక** కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

**ఈటీఎఫ్‌ల ద్వారా..**

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

**ఈక్విటీ ఎంఎఫ్‌లు**

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.




# ఒడిదొడుకుల్లోనే పయనం

దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి. తీవ్రరూపం దాల్చుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో అదానీపై కేసు, క్యూ2 జీడీపీ గణాంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా చెప్పుకోవచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. దీంతో ఆటుపోట్లకు ఆస్కారం ఎక్కువగానే ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,300-24,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




***గమనిక..:*** స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.